భీమిలి మెయిన్ రోడ్డు విస్తరణకు చర్యలు

పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


మెయిన్ రోడ్డును పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

భీమునిపట్నం: భీమిలి మెయిన్‌రోడ్డును ఏ మేరకు విస్తరించాలన్న దానిపై జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి మెయిన్‌రోడ్డు ఇరుకుగా ఉన్నందున విస్తరించాల్సి ఉందన్నారు. సుమారు 40 నుంచి 60 అడుగుల మేరకు విస్తరించడానికి వున్న అవకాశాలు పరిశీలిస్తామని... ఆ మేరకు విస్తరణ జరుగుతుందని తెలిపారు. అలాగే గంటస్తంభం చుట్టూ నాలుగు వైపులా గడియారాలు ఏర్పాటు చేయడంతోపాటు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారాలను ఆదేశించారు. మార్కెట్ బాగా దెబ్బతిని ఉండడంతో దాన్ని ఆధునికీకరిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో గతంలో ఉన్న షాపులు శిథిలమయ్యాయని అధికారులు తొలగించారని, వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని స్థానికులు కోరారు. దీనిపై త్వరలో చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ముఖ్యంగా పారిశుధ్యం మెరుగు పరిచేందుకు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడా చెత్త లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం వస్తున్నందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాని కోరారు. ఆయనతోపాటు స్మార్ట్ సిటీ కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, పనుల పర్యవేక్షణ ఇంజినీరు శ్యాంసన్‌రాజు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఏసీపీ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నియోజకర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, నాయకులు ఉన్నారు.

బస్ షెల్టర్ వద్ద విద్యుత్ సదుపాయం



బంగ్లామెట్ట బస్ షెల్టర్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట నూతన బస్ షెల్టర్ వద్ద శనివారం విద్యుత్ దీపం ఏర్పాటు చేశారు. 'విద్యుత్ సదుపాయం కల్పించాలని వినతి' శీర్షికతో 'సాక్షి'లో శుక్రవారం ప్రచురించిన వార్తకు జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం స్పందించింది. గ్రామ శివారులో ఉన్న ఈ బస్‌షెల్టర్ వద్ద చీకటిగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసిందే. వెంటనే అధికారులు స్పందించి విద్యుత్ దీపం వెలిగించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్చక, పురోహిత సంఘంలో బాధ్యతలు


రామాయణం మారుతీశర్మ, పెంట వెంకటరమణ శర్మ, భోగాపురం కార్తికేయ శ్రీనివాసశర్మ

తగరపువలస: రాష్ట్ర ప్రైవేట్ అర్చక, పురోహిత సంఘంలో చిట్టివలస, తగరపువలసకు చెందిన ముగ్గురికి బాధ్యతలు అప్పగించారు. వీరిలో భోగాపురం కార్తికేయ శ్రీనివాసశర్మను జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. ఇన్‌చార్జి హెడ్‌గా పెంట వెంకటరమణ శర్మను, తగరపువలస ఇన్‌చార్జిగా రామాయణం మారుతీశర్మను నియమించారు. వీరికి శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వెలగలేటి సతీష్‌కుమార్, కార్యదర్శి అధికార్ల కాళిదాస్, జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్ నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యతతో ముందుకు సాగుతూ పేద బ్రాహ్మణులకు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో చేపట్టబోయే సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు చామర్తి కేశవాచార్యులు, పిల్లా అరుణ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంగ్లిష్‌పై పట్టు అవసరం

భీమునిపట్నం: విద్యార్థులంతా ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రమీల రాజన్ సూచించారు. స్థానిక సెడార్ పాఠశాలలో శనివారం ఇంగ్లిష్ క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్లం ప్రాముఖ్యతకు అనుగుణంగా పట్టు సాధించడం అవసరమన్నారు. అనంతరం ఆంగ్లంపై పట్టు సాధిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. సెడార్ సీఈవో సునీల్ దుబే, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నో బ్యాగ్ డే సంబరాలు

తగరపువలస: బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. పనికిరాని, తక్కువ ఖర్చుతో కూడిన వస్తువులతో విద్యార్థులు బొమ్మలు తయారు చేశారు. వీటిలో రంగుల కాగితాలు, చింతగింజలు, పప్పుబద్దలు వినియోగించి చారిత్రాత్మక కట్టడాలు, గణిత సంబంధిత బోధనా సామగ్రి, వర్ణమాల, జంతు ప్రదర్శనశాల, ఇండ్ల రకాలు తయారు చేశారు. విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు సహకారం అందించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

తగరపువలస: రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి, వసతి గృహాల్లో సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎఫ్ఐ సభ్యులు భీమిలిలో శనివారం సైకిల్ యాత్ర చేపట్టారు. చిట్టివలసలో భీమిలి డివిజన్ సిటు నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, గుజ్జు పైడి సూరిబాబు తదితరులు వీరికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు. పీజీ విద్యార్థులకు విద్యాదీవెన అమలు చేయాలని, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కోరారు. విశాఖ జిల్లా అధ్యక్షుడు శివ, కార్యదర్శి ఎల్.జె.నాయుడు, సహాయ కార్యదర్శులు పల్లవి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: ప్రభుత్వ వసతి గృహాల్లోని సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎల్.జె.నాయుడు కోరారు. దీనిపై శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు


చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తగరపువలస: మోషన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్ తరపున పెదవాల్తేర్ విశాఖ ఐ ఆస్పత్రి, చిట్టివలస సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్య పరీక్షలు శనివారం నిర్వహించారు. 400 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 22 మందికి అద్దాలు అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి క్యాంప్ కో ఆర్డినేటర్ ఇ.సాయికృష్ణ కుమార్, ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహన్ రావు, సత్యసాయి సేవా సమితి జోనల్ కో ఆర్డినేటర్ ఎమ్వీ సాయికుమార్, ఆధ్యాత్మిక కో ఆర్డినేటర్ టీవీఆర్ బాబా, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన నేడు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామం (జాతర)లో శాస్త్రీయ, జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. నగరానికి చెందిన లలిత డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నారని తెలిపారు.

అలరించిన కోలాటం

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున శ్రీవారికి సుప్రభాత సేవ, తోమాల సేవ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం శ్రీవారి సన్నిధిలో అన్నమయ్య సంకీర్తనలకు చేసిన కోలాటం ఆకట్టుకుంది.

అభివృద్ధికి ప్రాధాన్యం


గొల్లలపాలెంలో బోరు బావిని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు

పద్మనాభం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు అన్నారు. మండలంలోని అనంతవరంలో రూ.48 లక్షలతో నిర్మించిన అభివృద్ధి పనులను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు, గిరిబాబు మాట్లాడుతూ ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పర్యటించినప్పుడు ప్రజలు కోరిన డ్రైనేజీలు, తాగునీటి సమస్యను నెల రోజుల్లోగా పరిష్కరించామన్నారు. ఈ సందర్భంగా వారు జలజీవన్ మిషన్ నిధులు రూ.10 లక్షలు, ఎంపీజీఎఫ్ నిధులు రూ.22 లక్షలతో నిర్మించిన సిమెంటు కాలువలు, ఎంపీజీఎఫ్ నిధులు రూ.6లక్షలతో నిర్మించిన ముస్లింల శ్మశాన వాటిక, రూ.10లక్షలతో నిర్మించిన తాగునీటి కుళాయిలు, పైప్‌లైను, గొల్లలపాలెంలో బోరు బావిని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కిలపర్తి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు గేదెల చంద్రరావు, రొంగలి రవి పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంలో అప్రమత్తత అవసరం

పీఎం పాలెం: వంట గ్యాస్ వినియోగించే మహిళలు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించగలమని హెచ్‌పీ గ్యాస్ డీలర్ హేమంత్ సూచించారు. పీఎం పాలెం హెచ్‌బీ బ్యాంకు ఎదురుగా గ్యాస్ వినియోగంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టౌ వినియోగించేటప్పుడు భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదనపు సిలిండర్‌కు దరఖాస్తు చేసుకుంటే తక్షణమే అందజేస్తామని తెలిపారు.

ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు

కొమ్మాది: ఫొటోగ్రఫీ అనేది ధైర్యంతో, ఓపికతో చేపట్టాల్సిందని పొసనేట్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ శ్వేతకుమార్ రంగారావు అన్నారు. కాపులుప్పాడలోని శ్రీ ప్రకాశ్ విద్యానికేతన్‌లో శనివారం నిర్వహించిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఫొటోగ్రాఫర్ బి.కె.అగర్వాల్, ఆలివెట్ హైస్కూల్ డైరెక్టర్ షైలా జాక్సన్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ పర్యటన


కణమాంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న గోపాలకృష్ణ తదితరులు

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ అడిషనల్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ శనివారం పర్యటించారు. ఈ నెల 26న గ్రామీణాభివృద్ధిని పరిశీలించడానికి ఎంపీలతో కూడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బృందం జిల్లా పర్యటనకు రానుంది. ఈ మేరకు మండలంలోని కణమాం, చందక పంచాయతీ జగ్గరాజుపాలెం గ్రామాలను సందర్శించారు. భూముల రీ సర్వే, డ్వాక్రా మహిళల పురోగతి, వారికి బ్యాంక్‌ల ద్వారా అందే లబ్ధి, ఉపాధి హామీ పథకం వంటి వాటిని స్టాండింగ్ కమిటీ సభ్యులు పరిశీలించనున్నారు. ఈ మేరకు ఆర్డీవో భాస్కర రెడ్డి, ఆనందపురం తహసీల్దార్ లోకవరపు రామారావు ఆయా గ్రామాల్లోని పూర్తి వివరాలను ఏడీ గోపాలకృష్ణకు వివరించారు. ఈ మేరకు బృందం పర్యటించే సమయంలో వారికి అన్ని వివరాలను వివరించడానికి సిద్ధం చేసి ఉంచనున్నారు.

జగనన్నే మా కుటుంబాలను నిలబెట్టారు


జీవీఎంసీ 5వ వార్డు సాయిరాం కాలనీలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

- సాయిరాం కాలనీ వాసుల ఆనందం
- ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు డ్రామాలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: జగనన్న ప్రభుత్వం తమ కుటుంబాలను నిలబెట్టిందని జీవీఎంసీ మధురవాడ జోన్ 5వ వార్డు సాయిరాం కాలనీకి చెందిన పలువురు మహిళలు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఇతర అధికారుల ముందు ఆనందం వ్యక్తం చేశారు. తాము ఎప్పుడూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని సరగడ సుజాత, జ్యోతి చెప్పారు. తాను దరఖాస్తు చేసుకోగానే ఇల్లు వచ్చిందని, తన కుమారుడుకి లక్షలాది రూపాయల విలువ చేసే బ్రెయిన్ సర్జరీ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేశారని, వలంటీర్ల వల్లే ఇవన్నీ అందుతున్నాయని జ్యోతి చెప్పారు. గతంలో ఇంటి కోసం ఎన్నో ప్రయత్నాలు చేసి విసిగిపోయనని, జగనన్న ప్రభుత్వంలో ఒక్క దరఖాస్తుతో ఇల్లు వచ్చిందని, తన ముగ్గురు అమ్మాయిలకూ డిగ్రీ వరకూ విద్యాదీవెన, వసతి దీవన మంజూరయ్యాయని సుజాత ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యేతో కుటుంబ సభ్యులు సెల్ఫీ దిగారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సాయిరాం కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని పలు నివాసాల వద్దకు ఎమ్మెల్యే శ్రీనివాసరావు వెళ్లి ప్రజల సమస్యలు తెసుకుని, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలుకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పథకాలు అమలు చేస్తుంటే... రాష్ట్రం శ్రీలంక అయిపోయిందని చంద్రబాబు అన్నారన్నారు.

ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో తానూ పథకాలు అమలు చేస్తానని డ్రామాలు ఆడుడూ ప్రజలను మోసం చేయడానికి బాబు ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరగా రెండున్నర కోట్ల రూపాయలతో వాటర్ ట్యాంక్ మంజూరయ్యిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతురావు, పోతిన శ్రీనివాసరావు, బొట్ట అప్పలరాజు, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, సీనియర్ నాయకుడు పిళ్లా సత్యనారాయణ, పోతిన సురేష్‌కుమార్, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఎమ్.రాజేశ్వరి, రైల్వే బోర్డు సభ్యుడు ఎన్.బాబ్జి, నాయకులు పెంటఅప్పన్న, అప్పారావు భవానీ, బండారు శివలక్ష్మి, చేకూరి రజని, గోడి అరుణ, శ్రీదేవి, వైఎస్ మూర్తి, యోగేశ్వరరావు, శ్రీనివాసరావు, సంజీవ్, సింహాచలం, సచివాలయ కన్వీనర్లు బి.శ్యామలరావు, పోతిన పాత్రుడు, జోజిబాబు, జెడ్పీ కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, సీఐ రామకృష్ణ, టీపీఎస్ ఝాన్సీ, ఆర్ఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు

గోస్తనీ నది గెడ్డలోకి వ్యర్థాలు

ఇష్టారాజ్యంగా ప్రైవేట్ విద్యా సంస్థల తీరు


దుర్గాలమ్మ ఆలయం వద్ద కలుషితమైన బోరుబావి


జిరాయితీ భూముల మధ్య నుంచి మురుగునీరు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డులో ఉన్న సంగివలస ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి విడుదలవుతున్న వ్యర్థాలతో గోస్తనీ నది గెడ్డతోపాటు బోరుబావుల నీరూ కలుషితమవుతోందని వలందపేట, సంగివలస వాసులు వాపోతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ విద్యా సంస్థలకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. ఈ క్రమంలో వాడుక నీరు, టాయిలెట్ల వ్యర్థాలను శుభ్రం చేయకుండానే స్థానికుల జిరాయితీ భూముల్లో నుంచి కచ్చా కాలువల ద్వారా వదిలేస్తున్నారు. దీంతో ఈ వాడుక నీరు ప్రవహించే మార్గంలో నివాసాల వద్ద దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలందపేట, దుర్గాలమ్మ ఆలయం, సంగివలస ఇందిరమ్మ కాలనీ మీదుగా శివారులో ఉన్న గెడ్డలోకి ఈ డ్రైనేజీని అనుసంధానం చేసి వదిలేశారు. గతంలో సంగివలస – పాండ్రంగి రహదారిలో సంగివలస జీవీఎంసీ స్కూల్ పక్కన చెక్‌డ్యామ్ వద్ద పుణ్యతిథులు, పండగల సమయంలో స్నానాలు ఆచరించేవారు. ప్రస్తుతం ఈ గెడ్డ నీరు కలుషితం కావడంతో స్నానాలకు స్థానికులు స్వస్తి పలికారు.

ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించాలి

ప్రైవేట్ విద్యాసంస్థల వెనుక భాగం నుంచి విడుదలవుతున్న వ్యర్థాలకు కేవలం 100 మీటర్ల వరకే డ్రైనేజీ ఉంది. మిగిలిన మార్గమంతా వ్యర్థాలు దుర్గాలమ్మ ఆలయ భూమితోపాటు జిరాయితీ భూముల నుంచి ప్రవహిస్తుండడంతో ఆయా మార్గాలు గలీజుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మంగళ, శుక్రవారాల్లో వందలాది మంది భక్తులు అమ్మవారి ఆలయానికి వస్తుంటారు. ఆలయం ముందు డ్రైనేజీ మురుగు కారణంగా ఇబ్బంది పడుతున్నారు. ఇదే అమ్మవారి ఆలయం వద్ద బోరుబావి నీరు కలుషితం కావడంతో బహిరంగంగా కాకుండా పైపుల ద్వారా వ్యర్థాలు తరలించుకోవాలని స్థానికులు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఇక్కడి విద్యాసంస్థల నుంచి వ్యర్థాలను శుభ్రం చేసి నదిలోకి కాకుండా విద్యాసంస్థల ముందు ఉన్న హైవే డ్రైనేజీ లేదా ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


సంగివలస ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి వదిలేస్తున్న వాడుక నీరు

ఉపాధ్యాయురాలి కుటుంబానికి పరామర్శ


సంధ్యారమణి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్సీ చిరంజీవిరావు, రాజబాబు

తగరపువలస: ఆనందపురం మండలం కొంత్యాం వద్ద ఈ నెల 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిట్టివలసకు చెందిన ఉపాధ్యాయురాలు పిరిడి సంధ్యారమణి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు శనివారం పరామర్శించారు. ఆమె భర్త శ్రీనివాసరావుతో మాట్లాడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు టీడీపీ భీమిలి ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, పిట్టా సురేష్, చిలకా నరసింగరావు, పిల్లా రాజేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఐఐఏఎంలో సదస్సు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ (ఐఐఏఎం) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇగ్నైటింగ్ మైండ్స్ అంశంపై శనివారం సదస్సు జరిగింది. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆచార్యుడు వీరేంద్ర శుక్లా పాల్గొన్నారు. బిజినెస్ స్కూల్ విద్యార్థులు భావి వ్యాపారవేత్తలుగా, హెచ్‌ఆర్‌లుగా ఎదిగే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్ణయాలపై అవగాహన కల్పించారు. ఐఐఏఎం బిజినెస్ స్కూల్ డైరెక్టర్ జనరల్ సతీష్, కార్యదర్శి రవీంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమించి అద్దెకు..

టీడీపీ నాయకుడి ఇష్టారాజ్యం


మారికవలస కూడలిలో ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న ఏటీఎం కేంద్రం

మధురవాడ: అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు ఉంది మధురవాడలో ఓ టీడీపీ నాయకుడి నిర్వాకం. విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 179లో ఓ టీడీపీ నాయకుడు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చక్కగా ఏటీఎం కేంద్రం ఏర్పాటు కోసం అద్దెకి ఇచ్చేశాడు. గతంలో ఇక్కడ పలు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలో ఆరితేరిన ఆ నాయకుడు తాజాగా జాతీయ రహదారిని ఆనుకుని సుమారు కోటి రూపాయల పైనే విలువ చేసే ప్రభుత్వ స్థలానికి నిబంధనలకు విరుద్ధంగా పట్టా తెచ్చేశాడు. ఆ స్థలంలో కొద్ది రోజుల క్రితం భారీ షెడ్ నిర్మించగా రెవెన్యూ అధికారులు అడ్డుకుని గోడలకు పాక్షికంగా రంధ్రాలు చేసి వదిలేశారు. ప్రస్తుతం అదే స్థలంలో హైవేని ఆనుకుని ఓ బ్యాంకుకు చెందిన ఏటీఎం కేంద్రం ఏర్పాటు పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రభుత్వ స్థలాన్ని అద్దెకి ఇచ్చి డబ్బులు వసూలు చేయాలనుకోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ సనపల రమణయ్యను వివరణ కోరగా... పరిశీలించి తక్షణమే చర్యలు చేపడతామని చెప్పారు. ఈ టీడీపీ నాయకుడే కొద్ది రోజుల క్రితం మారికవలస గ్రామాన్ని ఆనుకుని వుడా గ్రీనరీకి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి కొన్ని పాకలు ఏర్పాటు చేశాడు. అప్పట్లో పత్రికల్లో వార్తలు రావడంతో స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ పాకలు తొలగించేశారు. ఆక్రమణదారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

ఆలోచనా శక్తి పెంపొందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరావు

ఆనందపురం : చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందిస్తే వారు మేధావులుగా తయారవుతారని ఎస్ఎస్‌టీఎల్ అడిషనల్ డైరెక్టర్ కాశీ విశ్వేశ్వర రావు అన్నారు. మండలంలోని వెల్లంకిలో ఉన్న రవీంద్రభారతి పాఠశాలలో శనివారం కాస్మోస్ సైన్స్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఏ కొత్త అంశాన్ని కనుగొన్నా దేశానికి, సమాజానికి ఉపయోగపడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నీటిని శుద్ధిచేసే విధానం, స్పేస్ డెబ్రిస్, క్లౌడ్ సీడింగ్, సోలార్ పవర్ ఇరిగేషన్ సిస్టం, మార్స్, జీపీఎస్, చంద్రయాన్ వంటివి ఆకట్టుకున్నాయి. జీఎంలు వెంకటేష్, రమ్య, డీజీఎం లలిత, ఏజీఎం ఉమామహేశ్వర రావు, ప్రిన్సిపాల్ మంగలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీ గంధం రామస్వామి వారి సత్రం
దేవదాయ ధర్మదాయ శాఖ, భీమునిపట్నం, విశాఖపట్నం జిల్లా

టెండరు - కం - బహిరంగ వేలం ప్రకటన

విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో నున్న శ్రీ గంధం రామస్వామి సత్రం హక్కుభుక్తంలో గల సర్వే నెం. 144లో మొత్తం భూమి ఎ॥ 0-54 సెం॥లలో 'L' షేప్‌లోనున్న ఎ॥ 0-14 సెం॥ ఖాళీ స్థలం నెలసరి అద్దె చెల్లించు పద్ధతిన అప్పగింత తేదీ నుండి 11 సం॥ల కాలంనకు లైసెన్సు హక్కు ఇచ్చుటకు తేది 04-09-2023 ఉదయం 10 గం॥లకు భీమునిపట్నం టౌన్ చిన్న బజారు వద్ద నున్న శ్రీ గంధం రామస్వామి సత్రం స్థలం వద్ద టెండరు - కం - బహిరంగ వేలంపాట నిర్వహించబడును. ఆసక్తి గల వారు రూ. 50,000/-లు D.D. ప్రథమ ధరావత్తుగా చెల్లించి పాటలో పాల్గొనవలెను. పూర్తి వివరములకు దేవాలయ కార్యనిర్వహణాధికారి ఫోన్ నెం. 8639889366లో సంప్రదించవలెను.

భీమునిపట్నం,
తేది : 14.08.2023

బొంగరాల మురళీమోహన్
కార్యనిర్వహణాధికారి

సఫాయి కార్మికులు గౌరవంగా జీవించాలి

జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు డాక్టర్ పీపీ వావా

డాబాగార్డెన్స్ : సమాజంలో సఫాయి కార్మికులు గౌరవంగా జీవించాలని జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా పేర్కొన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013 అమలు చేయాలని, సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులు అధ్యయనం చేసి వారు సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలని తెలిపారు. ఆయన శనివారం విశాఖలో పర్యటించారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సఫాయి కార్మికుల ప్రాణాలు కాపాడుతుందన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013లో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో కమిషన్ గట్టి ప్రయత్నం చేస్తోందని, రాష్ట్రాలు, మున్సిపాల్టీలు, ఓడరేవుల అధికారులు, వివిధ సంఘాలు, జిల్లా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. పునరావాస చట్టం 2013 డిసెంబర్ 6 నుంచి అమల్లోకి తేవడంతో మనుషులంతా ఒక్కటే అనే భావన పెరిగిందని, మాన్యువల్ స్కావెంజర్ల పునరావాసం, ప్రత్యామ్నాయాన్ని కూడా చట్టం అందిస్తుందన్నారు. మురుగు కాలువలను మాన్యువల్‌గా శుభ్రపరిచే కార్మికుల ఆరోగ్యం, భద్రతకు పాటుపడుతూ, వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ విధంగా చర్యలు చేపడుతున్న జిల్లా యంత్రాంగాన్ని ఆయన ప్రశంసించారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, డీసీపీ విద్యాసాగర్‌నాయుడు పాల్గొన్నారు.